

◆ రోజురోజుకూ యువతలో పెరుగుతున్న ఆసక్తి
◆ టైం దొరికినప్పుడల్లా ఆటకు సమయం కేటాయింపు
◆ సాయంత్రం వేళ శారీరక, మానసికోల్లాసం

### చుట్టూ నెట్.. కొట్టొచ్చు పొట్టు పొట్టు

బాక్స్ క్రికెట్‌లో చుట్టూ నెట్ ఉంటుంది. బంతి బయటకు వెళ్లేందుకు ఏ అవకాశం ఉండదు. పైన కూడా నెట్‌తో కవర్ చేస్తారు. ఆడేందుకు వెళ్లేవారికి బాక్స్ క్రికెట్ నిర్వాహకులే బ్యాట్, బాల్, వికెట్లు, గ్లౌజ్‌లు తదితర అన్ని క్రీడా పరికరాలు అందిస్తారు. అందుకు తగ్గట్టు అన్ని వసతులు కల్పిస్తారు. చాలా చోట్ల బాక్స్ క్రికెట్‌లు బయట వెలుతురులోనే ఉంటాయి. అంటే ఇండోర్ స్టేడియం తరహా ఉండవు. కొన్నిచోట్ల మాత్రం అలా కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుత బిజీ షెడ్యూళ్లలో క్రీడలు ఆడేందుకు యువత ప్రత్యేకంగా సమయం కేటాయించేందుకు ఆసక్తి చూపుతున్నది. అందుకే వారాంతాల్లో ఈ బాక్స్ క్రికెట్‌కు మంచి గిరాకీ ఉంటున్నది. ఆడిన గంట లేదా రెండు గంటలు బిందాస్‌గా ఆడుతున్నారు. సాయంత్రం వేళ మరీ స్పెషల్‌గా ఉంటున్నది. లైట్ల వెలుతురులో ఆడటం అంటే అందరికీ ఆసక్తే. అందుకే సాయంత్రం అదీ.. లైట్ల వెలుతురులో ఆడేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు. ఆడిన గంట లేదా రెండు గంటల్లోనే వారానికి సరిపడే ఆసక్తిని తీర్చుకుటున్నారు. ప్రతి బంతిని బౌండ్రీ కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# బాక్స్ క్రికెట్‌కు భలే క్రేజీ

బ్యాట్, బాల్ తీసుకెళ్లాల్సిన పనిలేదు.. వికెట్లు చేతిలో పట్టుకుని పరుగులు తీయాల్సిన అవసరమూ లేదు.. గ్రౌండ్ గుంతలుగా ఉందేమో అని దిగులు చెందాల్సిన పనేలేదు. అయ్యో చీకటి పడితే బాల్ కనిపించదేమో అని ఆందోళనకు ఆస్కారమే లేదు.. మరి ఇదేంటి? ఏదీ తీసుకెళ్లకుండానే ఎలా ఆడుతామని అనుకుంటున్నారా? అవును నిజమే. ఇప్పుడు మనం ఏ బ్యాటూ తీసుకెళ్లాల్సిన పనిలేదు. ముందుగా బుక్ చేసుకుంటే చాలు.. అన్నీ అక్కడే అందుబాటులో ఉంటాయి.. అదే బాక్స్ క్రికెట్. ఇటీవల యువతలో ఎక్కువగా వినిపిస్తున్న పదం ఇది. బాక్స్ క్రికెట్‌కు రోజురోజుకూ క్రేజీ పెరుగుతున్నది. - పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 7

క్రికెట్.. క్రికెట్.. క్రికెట్.. దాదాపుగా ఈ పదం తెలియనివారు ఎవరూ ఉండరు. ఈ ఆట తెలియని వారు కూడా తక్కువే. చాలామంది ఏదో ఒక వయసులో క్రికెట్ ఆడే ఉంటారు. క్రికెట్ అనగానే.. కొంచెం పెద్ద పట్టణాల్లో యువకులు గ్రౌండ్ వెతుక్కుంటూ వెళ్లిపోతారు. కొన్నిచోట్ల ముందుగానే బుక్ చేసుకుని ఆటలు ఆడేందుకు ఇష్టపడుతున్నారు. ఒక్కో జట్టుకు 11 మంది, బ్యాట్‌లు, బాల్స్, వికెట్లు, గ్లౌజ్‌లు ఇలా అన్నీ ఉన్న బ్యాగులు భుజాన వేసుకుని మైదానాల వైపు పరుగులు తీస్తారు. ఇక గ్రామాల్లో మాత్రం బ్యాట్‌లు, బాల్స్ ఉంటే చాలు చిన్న గల్లీ అయినా క్రికెట్ ఆడేస్తుంటారు. ప్రస్తుతం యువత ఉన్నత చదువులు, ఉద్యోగాలతో వారంలో ఐదు రోజులు బిజీగా గడిపినా వీకెండ్‌లో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నది. శారీరక శ్రమతోపాటు మానసికోల్లాసం లభిస్తుండటంతో ఆసక్తి చూపుతున్నది. యువత ఆసక్తికి అనుగుణంగా క్రికెట్ ప్రేమికుల కోసం బాక్స్ క్రికెట్ స్టేడియాలు వెలుస్తున్నాయి. చిన్నపాటి స్థలాలను సైతం నిర్వాహకులు గ్రౌండ్‌లుగా సిద్ధం చేసేస్తున్నారు. ఇటీవల బాక్స్ క్రికెట్‌కు క్రేజీ పెరిగింది.

### గంటకో రేటు..

గ్రౌండ్‌లో ఒక్కో మ్యాచ్ ఆడేందుకు కనీసం రెండు గంటలు పడుతుంది. బాక్స్ క్రికెట్‌లో మాత్రం ఒక్కో గంటకు రేటు నిర్ణయిస్తారు. గంటకు సాధారణంగా రూ.700 వరకు తీసుకుంటున్నట్లు ఓ బాక్స్ క్రికెట్ నిర్వాహకుడు తెలిపాడు. ఒక్కో జట్టులో ఏడుగురు చొప్పున 14 మంది ఆడితేనే ఆటలో మజా ఉంటుందని చెప్తున్నాడు. తక్కువ మంది ఆడితే పెద్దగా ఆసక్తి ఉండదంటున్నాడు. రద్దీని బట్టి గంటకు రూ.600 నుంచి 800 వరకు కూడా నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. వారాంతాల్లోని సాయంత్రం సమయం ఈ బాక్స్ క్రికెట్‌లు బిజీగా మారిపోతున్నాయి. కొందరు స్నేహితులతో కలిసి ఆడేందుకు వస్తుండగా.. మరికొందరు కుటుంబసభ్యులే వచ్చి ఉత్సాహంగా ఆడుతున్నారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోసం రూ.12 లక్షల నుంచి 20 లక్షల వరకు ఖర్చు పెడుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నారు. సదుపాయాలు బాగుంటుండంతో క్రీడాకారులు సైతం అక్కడ సమయం వెచ్చించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



మహేశ్వరంలో జరిగిన కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తా..

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, డిసెంబర్ 7: నియోజకవర్గ ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరంలో నిర్వహించిన కృతజ్ఞతా సభలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజూనాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శివగంగ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించి మొదటిసారి నియోజకవర్గానికి రావడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సబితాఇంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి నియోజకవర్గ ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టారని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని పని చేస్తానని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఇక ముందు వచ్చేది ఎన్నికల కాలమని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆమె సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతామని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధికి తనకు సహకరించిన అధికారులు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్, సహకార బ్యాంక్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజూనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, కూన యాదయ్య, మునగపాటి నవీన్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ పాల్గొన్నారు.



కృతజ్ఞతా సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

చలికాలం.. మొక్కకు పోషకాలు అందేలా చూడాలి

రైతులకు శాస్త్రవేత్తల సూచన

# నారుమడి పైలం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులు ప్రధానంగా పండించే పంట వరి. వరి పండించడంలో రైతులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ మితిమీరిన తెగులు సోకడంతో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తున్నది. నారుమడి వేసిన నాటి నుంచి కోత కోసే వరకు మందులు పిచికారీ చేయాల్సి వస్తున్నది. ముందస్తుగానే రైతులు నారుమడి సాగులో తగు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్ల బారినుంచి తప్పించుకునే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - న్యూస్ నెట్‌వర్క్

### అధికారుల సలహాలు పాటించాలి



ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం ఉంటుంది. - డా.స్వప్న, కేవీకే శాస్త్రవేత్త





### పాటించాల్సిన జాగ్రత్తలు

* ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నారుమడిలో చలి తీవ్రతను అధిగమించడానికి సాయంత్రం వేళల్లో నీరు పెట్టి ఉదయం తీసెయ్యాలి.
* నారుమడికి వెచ్చదనాన్ని అందించేందుకు కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు, వర్మి కంపోస్టును వాడితే మంచిది.
* తీవ్రస్థాయిలో చలితీవ్రత నుంచి నారుమడిని రక్షించడానికి ఒక అడుగు ఎత్తులో వెదురు బొంగులు పాతి వాటిపై ప్లాస్టిక్ షీట్లను రాత్రి పూట వేసి ఉదయం తొలగించాలి.
* చలికాలంలో పోషకాలు సరిగ్గా అందక కొన్నిసార్లు జింకు లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. జింక్ లోపాన్ని నివారించేందుకు జింక్ సల్ఫేట్ 2గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
* ఎకరానికి సరిపడే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని రెండు దఫాలుగా 6.25కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 2కిలోల డీఏపీ, 1కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వాడితే చలి తీవ్రత నుంచి నారు మడులను కాపాడుకోవచ్చు.

పంటల మార్పిడి..

రోగకారక జీవుల కట్టడికి ఈ విధానం ఎంతోమేలు

కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీకృష్ణ సలహాలు

# ఫలితాలు అమోఘం

### పంట మార్పిడితో రోగాలకు అడ్డుకట్ట



రైతులు ఒకే రకమైన పంటలు సాగుచేయడం ద్వారా ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువవుతాయి. రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరుసగా ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పురుగుల జీవిత చక్రాన్ని నిలిపివేయవచ్చు. దాంతో రైతులు మంచి లాభాలను పొందగలుగుతారు. రైతులు ఒకే రకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టడం ద్వారా మంచి లాభాలు గడించే వీలుంటుంది.

- శ్రీకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

ప్రస్తుతం భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఒకేరకం పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. దీంతో భూమిలోని సారం తగ్గిపోవటంతో పాటు క్రిమికీటకాలు ఇంకా వృద్ధి చెంది దిగుబడి తగ్గే అవకాశమున్నందున రైతులు ఒకే రకమైన పంటలను సాగుచేసే విధానానికి స్వస్తి చెప్పి పంట మార్పిడి విధానాన్ని చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీకృష్ణ తెలుపుతున్నారు. పంటల మార్పిడితో భూమిలోని పోషకాలు సమృద్ధిగా అందుతాయి. పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం.. - ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 7





### పంటలు సాగుచేయాల్సిన విధానం

* వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
* చెరుకు తర్వాత వరి వేయడం వల్ల వేరు పురుగును తగ్గించొచ్చు. అలాగే, వరిలో దోమపోటు నివారించవచ్చును.
* పత్తి వేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నివారించవచ్చు.
* జొన్న, మొక్కజొన్న తర్వాత కందిని సాగుచేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
* వరి సాగు చేసే పొలంలో ముందుగా పప్పుధాన్యాలను సాగుచేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
* వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లు వేయాలి.
* కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేయాలి.
* నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పైర్ల సాగును కొంత కాలం ఆపాలి.
* ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను పప్పు జాతి పంటలైన పెసర, మినుము, వేరుశనగ సాగుతో మార్పిడి చేయాలి.
* ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

* ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించటం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి.
* పురుగు జీవిత చక్రం పూర్తి చేసుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
* పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం ఛేధించబడుతుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటపై ఆశించడం సాధారణంగా జరుగదు.
* వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
* ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప మొదలైన పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
* వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేల పై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
* నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పక చేయాలి.
* అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.



# వరి కొయ్యలను కాల్చొద్దు..

- అవగాహన లేమితో కాల్చుతున్న రైతులు
- భూమిలో కలియదున్నితేనే లాభం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

**వరి పంటను** రైతులు గతంలో కొడవళ్లతో మొదళ్ల వరకు కోసేవారు. పశువుల పెంపకంపై కూడా రైతులు మక్కువ చూపేవారు. దీంతో వరి గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వచేసేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకెళ్తున్నారు. మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. మళ్లీ దుక్కి దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడా కాలబెడుతున్నారు. దీంతో అధిక నష్టాలు వచ్చే అవకాశమున్నదని, వరి కొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 7

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతో పాటు పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. సారవంతమైన భూమి దెబ్బతింటున్నది. రైతులు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వరి కొయ్యల మిగులు అవశేషాలతో సిరులు సంపాదించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి కోత అనంతరం ఉండే గడ్డిని పశువులకు వాడడం లేదా కంపోస్టుగా మార్చుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

### కొయ్యలను కాల్చడంతో అనర్థాలు..

పొలంలో కొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నదని శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అవగాహన లేమితో పంటకు ఎంతో మేలు చేసే కొయ్యలను భూమిలో కలియదున్నకుండా కాల్చివేసి భవిష్యత్ పంటలను నాశనం చేస్తున్నారని, వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని చెబుతున్నారు. కొయ్యలను కాల్చివేసే క్రమంలో భూమి గట్టిపడుతున్నదని, పొలాన్ని కలియదున్నడం వీలుకాదని పేర్కొంటున్నారు. కొయ్యలను కాల్చివేయడంతో భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములు నాశనమవుతున్నాయని, దీంతో భూమి గుల్లగా మారే పరిస్థితి ఉందని చెబుతున్నారు. నాట్లు వేసిన వేర్లకు సరిగ్గా పోషకాలు చేరవని, పైరు పెరగదని వివరిస్తున్నారు. రైతులు ఎక్కువగా యూరియాను వినియోగించాల్సి వస్తున్నదని, కానీ దాన్ని స్వీకరించి వేర్లకు అందించే సూక్ష్మజీవులు అప్పటికే అంతరించిపోవడంతో ప్రయోజనం లేకుండా పోతున్నదని పేర్కొంటున్నారు.

ఇదే సమయంలో యూరియాను అతిగా వాడడంతో భూమిలోకి చేరి భూగర్భ జలం విషతుల్యమవుతుందని, వాతావరణంలో అనేక మార్పులు కలుగుతాయని చెబుతున్నారు. కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్ గాలిలో కలిసి వాతావరణం, జీవకోటిపైన తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### కలియదున్నితేనే లాభం..

పంట కోసిన వెంటనే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలి. దీంతో కొయ్యలు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. తర్వాత సేంద్రియ ఎరువుగా మారుతుంది. వరి కొయ్యలను కలియదున్నడం, కుప్ప చేయడంతో నేలల్లో పగుళ్లు రాకపోవడం, తేమ ఆవిరి కావడం తగ్గి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. కొయ్యలను కలియదున్ని వెంటనే కుళ్లిపోయేలా పొటాషియం చల్లితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. తదుపరి పంటకు పోషకాలు విపరీతంగా పెరుగుతాయి.



